వరి నేరుగా విత్తితే.. అధిక దిగుబడులు

- ఆరుతడి పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు
- తగ్గనున్న పెట్టుబడి
- అత్యల్పంగా నీటి తడులు
- తక్కువ చీడపీడలు


ట్రాక్టర్ ద్వారా నేరుగా వరి విత్తుతున్న దృశ్యం (ఫైల్)


రైతులకు సూచనలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు (ఫైల్)

బనగానపల్లె : శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో వెదజల్లడం ద్వారా, లేదా 20 సెంటీమీటర్ల దూరంలో నాగలిసాలు వెనుక, గొర్రుతో, ట్రాక్టర్‌తో ఎరువులు, విత్తనాన్ని ఒకేసారి వేసే వరి విత్తనం వేయాలి. విత్తనాన్ని ఎక్కువ లోతులో వేస్తే మొలకశాతం దెబ్బతినే అకాశం ఉంది. పై పొరల్లో పడేటట్లుగా అంటే.. సుమారు 2.5 నుంచి 5 సెంటీమీటర్ల లోతులో వేసుకోవాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకొని భూమిని మెత్తగా దుక్కి చేస్తే కలుపు సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. వీలైనంత వరకు నేల సమతలంగా ఉండేలా చూసుకోవాలి.

ఎరువుల యాజమాన్యం..

ప్రధాన పోషకాలను భూసార ఫలితాల ఆధారంగా.. సిఫారసు మేరకు వేయాలి. సిఫారసు చేసిన భాస్వరం ఎరువు పూర్తి మోతాదును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పొటాష్ ఎరువును ఆఖరి దుక్కిలో సగభాగం, మిగిలిన సగం నత్రజని ఎరువుతో పాటు అంకురం ఏర్పడే దశలో వేయాలి. నత్రజని ఎరువును మూడు దఫాలుగా వేయాలి. విత్తిన 15 రోజులకు, పిలక దశలో, అంకురం దశలో వేయాలి.

ఆరుతడి పద్ధతిలో లాభాలు..

నారుమడి నాట్లకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. చెరువుల కింద, కాల్వల కింద సాగు చేసే పరిస్థితుల్లో నాట్లు ఆలస్యం కాకుండా సకాలంలో పంటలు సాగు చేసుకోవచ్చు. పంట వారం నుంచి 10 రోజులు ముందుగా కోతకు వస్తుంది. నీరు ఆదా అవుతుంది. సాధారణంగా వేసే మాగాణి వరి దిగుబడులతో పోల్చినప్పుడు సుమారు 80–90శాతం దిగుబడులు పొందవచ్చు.

సాధారణంగా ఆరుతడి వరిలో ఇనుపధాతు లోపం వస్తుంది. దీంతో ఆకులు తెల్లగా పాలిపోయినట్లు ఉండి, ఎదుగుదల కుంటుపడుతుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే లీటర్ నీటికి 20 గ్రాముల అన్నభేరి, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్యం..

ఈ పద్ధతిలో నీరు నిల్వగట్టడం ఉండదు.కావున కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. కలుపు నివారణకు ఎకరాకు ఒక లీటర్ పెండిమిథాలిన్ 35 గ్రాములు, ఆక్సాడయర్జిల్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 2, 3 రోజుల్లోపు పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు కలుపు ఉధృతిని బట్టి బిస్‌పైరిబాక్ మందును 80–120 మి.మీ లేదా కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు 400 గ్రాములు సోడియంస్టాల్ మందును పిచికారీ చేయాలి. సాలు వరుసల్లో విత్తితే వరసల మధ్య అంతరకృషి చేసుకోవచ్చు. దీంతో తక్కువ ఖర్చుతో కలుపు నివారించుకోవచ్చు. పంటకు ప్రతి 7–10 రోజులకు ఒకసారి అవసరం మేరకు నీటి తడులు ఇవ్వాలి. పంటకు అవసరమైన తేమను అందించడం వల్ల పంట కీలక దశల్లో బెట్టకు గురి కాదు. ఈ పద్ధతిలో నీటిని 40–50 శాతం వరకు ఆదా చేయవచ్చు.

మంచి దిగుబడులు సాధించవచ్చు



నేరుగా వరి విత్తే పద్ధతి వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుది. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకొని ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చు. చాల మంది రైతులు ఈ పద్ధతి ద్వారా వరి పంటసాగుకు ఉత్సాహం చూపుతున్నారు. చీడపీడలు తక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది.

– సుధాకర్, శాస్త్రవేత్త, కేవీకే యాగంటిపల్లె

క్లుప్తంగా

జీఎన్ఎస్ కాల్వలో పెరిగిన ప్రవాహం


కాల్వలో పెరిగిన నీటి మట్టం

బనగానపల్లె : పట్టణ సమీపంలోని యాగంటిపల్లె మీదుగా అవుకు రిజర్వాయర్ వరకు ప్రవహించే జీఎన్ఎస్ కాల్వలో నీటి ప్రవాహం 15వేల క్యూసెక్కులకు పెరిగినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం విడుదలైన నీటి మట్టం 10వేల క్యూసెక్కులని చెబుతున్నారు. ఈ నీరు అవుకు రిజర్వాయర్‌కు చేరి అక్కడి నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోట, మైలవరం రిజర్వాయర్ల ద్వారా ఆ జిల్లాలోని మరిన్ని ప్రాంతాలకు చేరుతుంది.

సమాజసేవతోనే మానవ జన్మకు సార్థకత


సీహెచ్‌సీలో అన్నదానం చేస్తున్న యువ వైద్యురాలు సాజిదా

బేతంచెర్ల : సమాజానికి సేవ చేయడం ద్వారా మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో హైదరాబాద్ బాషా కుమార్తె యువ వైద్యురాలు సాజిదా సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు, గర్భిణులకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సమాజ సేవతో పాటు ప్రతి సోమవారం దాతల సహకారంతో అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు, సభ్యులు పురుషోత్తం రెడ్డి, వన్నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా


జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ యాక్సిస్ బ్యాంకు, జొమాటో, అమెజాన్, దొడ్ల డెయిరీ, ఎన్ఐఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర పది కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎం ఫార్మసీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివరాలకు సెల్ 8688651650, 97059 98056 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మెనూ పాటించాలి


కానాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రమణారెడ్డి

సంజామల:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈఓ రమణారెడ్డి సూచించారు. సోమవారం కానాల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, డీపీఈపీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని చెప్పారు.

యాప్‌ల భారాన్ని తగ్గించాలి

డోన్ టౌన్: అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జులేఖ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి సెల్ ఫోన్లను కార్యాలయంలో అందజేశారు. వారు మాట్లాడుతూ 2021లో ఇచ్చిన ఫోన్లు ప్రస్తుతం నెట్‌వర్క్‌లకు సరిపడ స్పీడు, పనితనం లేదని, నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకురాళ్లు సులోచన, నాగలక్ష్మి, గుల్జార్, సుమలత, రహమత్‌బీ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ సమస్యలపై విచారణ జరిపించాలి

బేతంచెర్ల : స్థానిక కేజీబీవీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో పాఠశాలలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అలాగే అస్వస్థకు గురైన విజయలక్ష్మి, నాగభావనీల ఆరోగ్యంపై స్పందించాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కోవెలకుంట్ల: తల్లిపాలు బిడ్డకు అన్ని విధాలా శ్రేయస్కరమని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం గైనిక్ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు.గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం తల్లి, బిడ్డకు మంచిదన్నారు. డాక్టర్లు సుజాత, వెంకటలక్ష్మి, హెడ్‌నర్స్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

షడ్రక్‌కు నివాళి

డోన్ టౌన్ : కార్మిక నేత టి.షడ్రక్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి రామాంజనేయులు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


కొట్రా దినేశ్

ప్యాపిలి: పోతుదొడ్డిలో కొట్రా శ్రీనివాసులు కుమారుడు కొట్రా దినేశ్ అదృశ్యమైనట్లు సోమవారం ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 3వ తేదీ ఇంటి నుంచి వెళ్లి పోయినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓర్వలేక మినరల్ వాటర్ ప్లాంట్ కూల్చివేశారు

- జాయింట్ కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫిర్యాదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి

నంద్యాల: ప్రజల దాహం తీర్చే మినరల్ వాటర్ ప్లాంట్‌పై తన ఫొటో ఉండటాన్ని చూసి ఓర్వలేక మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఏకంగా ప్లాంట్‌నే కూలిచ్చివేయించారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వాటర్ ప్లాంట్ కూల్చివేత ఘటనపై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతకం రామిరెడ్డి మాట్లాడుతూ 2019 డిసెంబర్‌లో పాత బస్టాండ్ సమీపంలోని గ్రామ కంఠ భూమిలో పంచాయతీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశానన్నారు. ఈ వాటర్ ప్లాంట్‌లో కూలింగ్ వాటర్ సదుపాయం కూడా కలిపించానన్నారు. అయితే, ఈ ప్లాంట్‌పై తన ఫొటో ఉందని మంత్రి కూల్చివేయించడం ఎంత వరకు సబబు అన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనుమతి, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా పోలీసులను కాపలా పెట్టి ప్రైవేటు గూండాలతో కూల్చివేయించారన్నారు. ఆ సమయంలో ప్లాంట్‌లోని మిషన్లను సైతం దొంగిలించారన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. దీనిపై డీపీఓతో విచారణ చేయిస్తానని జాయింట్ కలెక్టర్ మాజీ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉన్నారు.

కోవెలకుంట్లలో 65.8 మి.మీ వర్షం


కోవెలకుంట్ల మండలం అమడాల మెయిన్‌రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపునీరు


సౌదరదిన్నె సమీపంలో అలసంద పంటలో నిలిచిన వర్షపునీరు

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- పంటల్లో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల:ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు భారీ వర్షం కరిసింది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 65.8 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 31 మి.మీ, దొర్నిపాడు మండలంలో 18.4 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 18 మి.మీ, సంజామల మండలంలో 11.2 మి.మీ, అవుకు మండలంలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. కోవెలకుంట్లలో భారీ వర్షం కురియడంతో పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. పట్టణశివారులోని జగనన్న కాలనీని వర్షపునీరు చుట్టుముట్టడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బస్టాండ్ చుట్టూ రెండు అడుగుల మేర వర్షపునీరు చేరడంతోప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. అమడాల మెయిన్ రోడ్డులో వర్షపునీరు ఉప్పొంగి ప్రవహించింది. చిన్నకొప్పెర్ల- వల్లంపాడు గ్రామాల మధ్యలో నల్లవాగుకు వర్షపునీరు పోటెత్తడంతో ఆయా గ్రామాల ప్రజలు వాగు దాటేందుకు అవస్థలు పడ్డారు.

పంటల సాగుకు అనుకూలం..

సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 24,915 హెక్టార్లలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 5,876 హెక్టార్లలో మొక్కజొన్న, మినుము, పెసర, కంది, ఉల్లి, బెండ, అలసంద, పొద్దుతిరుగుడు, కొర్ర, ఆముదం, తదితర పంటలు సాగు చేశారు. ఈ నెలలో సాగు చేయాల్సిన వివిధ పంటలకు వర్షం అనుకూలంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు.

బనగానపల్లె: బనగానపల్లె ప్రాంతంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు కురిసిన భారీ వర్షం 31 మి.మీ., నమోదైందని అధికారులు తెలిపారు. 20 రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో సుమారు 3వేల ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట ఎండుదశకు చేరుకోగా.. వెయ్యి ఎకరాల్లో సాగైన కంది పంటలో ఎదుగుదల లోపించిందని రైతులు పేర్కొంటున్నారు.

యాప్ సేవలు నిలిపివేత


సెల్‌ఫోన్లను అధికారులకు తిరిగి ఇచ్చేస్తున్న అంగన్‌వాడీలు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహించే అంగన్‌వాడీ వర్కర్లుకు ప్రభుత్వం తమకు ఇచ్చిన సెల్‌ఫోన్లతో యాప్ పనులు చేయలేమంటూ.. ప్రభుత్వం అందజేసిన సెల్ ఫోన్లను అంగన్‌వాడీ వర్కర్లు తిరిగి సోమవారం అధికారులకు ఇచ్చేశారు.అసోసియేషన్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి,సెక్రటరీ రోజారమణి మాట్లాడుతూ యాప్ సేవలకు ఈ సెల్‌ఫోన్లు సపోర్ట్ చేయడం లేదన్నారు. కొత్త ఫోన్లు ఇచ్చే వరకు తాము యాప్ సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. నాయకురాల్లు సుకన్య, రామేశ్వరి, సుమలత,సుజాత,శ్రీదేవి,తులశమ్మ,పద్మావతి ఉన్నారు.

ముచ్చట్ల క్షేత్రంలో శ్రావణమాస పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ముచ్చట్ల భ్రమరాంబామల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణలో మహామంగళహారతి నిర్వహించారు.

యాగంటీశుడికి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీకి సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ముస్తాబు చేసి విశేషంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఊరేగించారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

డోన్: క్షయ వ్యాధిని సంపూర్ణంగా నివారించేందుకు చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు వ్యాధిపై సరైన అవగాహన కల్పించాల్సి ఉంటుందని డోన్ యూనిట్ టీబీ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం రావడం, రాత్రి సమయాల్లో చెమటలు పట్టడం, ఛాతీలో నొప్పి తదితర సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కరీముల్లా, ఉపేంద్ర, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, స్టాఫ నర్సు నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్


మోటార్ సాయంతో మురుగు నీటిని బయటకు పంపింగ్ చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారి చెంతనే కల్వర్టు వద్ద నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించారు. గ్రామంలోని మూడు వైపుల నుంచి కాల్వల ద్వారా వచ్చే మురుగు నీరు కల్వర్టు వద్ద కొద్ది రోజుల నుంచి నిల్వ చేరాయి. వీటిపై ఈనెల 1న సాక్షి దినపత్రికలో 'ముందుకు కదలని మురుగు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్వర్టు వద్ద నిల్వ చేరిన నీటిని మోటార్ల సాయంతో పూర్తిగా పంపింగ్ చేశారు. ఆ తర్వాత గ్రీన్‌అంబాసిండర్లు పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి,కల్వర్టు ద్వారా మురుగునీరు ప్రవహించేలా చర్యలు చేపట్టారు.

రిజర్వేషన్లు కల్పించాలి

బనగానపల్లె రూరల్ : చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్లు అమలు చేయాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు చల్లా బాలస్వామి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చెరువుపల్లె గ్రామంలో నియోజకవర్గ యాదవ మహాసభ కన్వీనర్ మద్దయ్య ఆధ్వర్యంలో యాదవ సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ..యాదవులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్రంలో యాదవులు 18శాతం ఉన్నారని, వారిని రాజకీయ పార్టీలు గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

డోన్ టౌన్ : పట్టణ సమస్యలను ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు ఆరోపించారు. చిన్నపాటి వర్షానికి గుంతల మయమైన రోడ్డును బాగుచేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, దీని కారణంగా కొద్ది పాటి వర్షానికే చెరువులు, కుంటలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. మౌలిక వసతులపై ఎమ్మెల్యే, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రామ్‌మోహన్, శ్రీరామ్‌నగర్, కొండపేట శాఖల కార్యదర్శులు బాలమద్దయ్య, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నాగరాజు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డీఎంగా పనిచేస్తున్న తిరుపతయ్య ఈ ఏడాది మే నెలాఖరున పదవీ విరమణ పొందటంతో ఆళ్లగడ్డ డీఎం వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్ డీఎంగా కొనసాగుతున్నారు. నందికొట్కూరు అసిస్టెంట్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న నాగరాజును కోవెలకుంట్ల డీఎంగా నియమించారు.

తప్పిన ప్రమాదం

బనగానపల్లె రూరల్ : నందివర్గం స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామంలో ఆర్టీసీ బస్సు,మోటార్ సైకిల్ ఢీ కొన్న సంఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు నందవరం గ్రామానికి చెందిన సురేష్ విఠలాపురం గ్రామ వైపు నుంచి బిల్డింగ్ కాలనీకి మోటార్ సైకిల్‌పై వస్తుండగా నంద్యాల నుంచి బనగానపల్లె వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదశాత్తు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో సురేష్‌కు స్వల్ప గాయాలవడంతో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రమశిక్షణతో చదవాలి

ప్యాపిలి: విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారంహెచ్ఎం సరళాదేవి అధ్యక్షతన విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కలిపించారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: కొత్తగా 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాచవాండ్లపల్లి, రాంపురం, మామిళ్లపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక

బనగానపల్లె రూరల్ : ఓపెన్ స్కూల్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో ఎంఈఓ స్వరూప ఆధ్వర్యంలో దూరవిద్యా విధానం-2025-26 పై ఆశా వర్కర్లు, వివిధ పాఠశాల హెచ్ఎంలు, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక మాట్లాడుతూ.. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఈ విద్యావిధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చదువును ఆపేసిన అభ్యర్థులకు ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు, బుక్ కీపర్లు, ఉపాధ్యాయులు,స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు అవగాహన కల్పించి ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంఈఓ కోరారు.

విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

బేతంచెర్ల : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. గత నెలలో ఓ బాలిక అనారోగ్యంతో మరణించమే కాకుండా ఈనెల 2న ఇద్దరు విద్యార్థినులు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేకోట్ల, మండల స్థాయి అధికారులతో కలిసి సోమవారం కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. కాగా, కింది స్థాయి సిబ్బంది తమ ఆదేశాలను పట్టించుకోవడంలేదని.. ఏమైనా చేబితే రాజకీయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రిన్సిపాల్ అబీదా బేగం ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రిన్సిపాల్ ,సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా ఎమ్మెల్యే ఎదురుగానే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో, ఇక్కడ పని చేయడానికి వచ్చారా లేక రాజకీయాలు చేయడానికి వచ్చారా అని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఆదేశాలను పద్ధతిగా పాటించి ఎవరి పనులు వారు సక్రమంగా చేయాలని లేకపోతే, మానుకొని వెళ్లిపోవాలని, కొత్తవారిని నియమించుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే ముఖాముఖీ నిర్వహించారు. అదనపు మరుగు దొడ్లు, ఆట స్థలం, దుప్పట్లు తమ పెట్టెలను భద్ర పరుచుకోవడానికి ర్యాక్‌లు ఏర్పాటు చేయాలని, ఉదయం టిఫిన్ ఆలస్యంగా పెట్టడమే కాకుండా అరకొరగా పెడుతున్నారని విద్యార్థినులు తమ ఆవేదన వెల్లిబుచ్చారు. విద్యార్థినులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సస్పెండ్ చేయిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : కొచ్చెర్వు సబ్ స్టేషన్ 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల వల్ల మంగళవారం ఉదయం 10 నుంచి మ .ధ్యాహ్నం 2 గంటల వరకు కొచ్చెర్వు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమ వారం తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 5 గంటల వరకు ఇస్తామన్నారు.